క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో రామ్మోహనరావు

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా నరసన్నపేట అసెంబ్లీ పరిధికి సంబంధించి పోలింగ్ సామగ్రి పంపిణీ కోసం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు రిటర్నింగ్ అధికారి రామ్మోహనరావు తెలిపారు. కళాశాల వద్ద డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ సిబ్బంది ఉదయానికే చేరుకోవాలని కోరారు. 34 సెక్టోరియల్స్‌గా విడదీసి 290 పోలింగ్ కేంద్రాలకు సామగ్రి పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

సజావుగా ఎన్నికలకు సహకరించండి

● జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

టెక్కలి రూరల్: ఈ నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేలా ప్రజలందరు సహకరించాలని జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక ప్రజలను కోరారు. టెక్కలి డీఎస్పీ కార్యాలయం ఆవరణలో డీఎస్పీ బాలచంద్రారెడ్డి అధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ఎటువంటి తగాదాలకు అవకాశం ఇవ్వకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. గొడవలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కోవద్దని అన్నారు. ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ట్రైనింగ్ డీఎస్పీ సీహెచ్ రాజా, సీఐ పైడయ్య, ఎస్-1 లక్ష్మి ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

● ఏఎస్పీ ప్రేమ కాజల్



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రేమ కాజల్

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు ఎస్పీ ప్రేమ కాజల్ కోరారు. స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో జట్టు కలాసీ సంఘ భవనం వద్ద శుక్రవారం రాత్రి ఎన్నికల సందర్భంగా స్థానికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, పోలింగ్ ప్రశాంతతకు భంగం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐ బి.ప్రసాదరావు, నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

● జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక



సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

టెక్కలి: అల్లర్లకు అవకాశం ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా వేయాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చూడాలని సూచించారు. ఎన్నికల విధులపై పోలీస్ సిబ్బందితో శుక్రవారం టెక్కలిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అడిషనల్ ఎస్పీలు ప్రేమ్‌కాజల్, గంగాధరం, డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐలు పైడయ్య, చంద్రమౌళి ఉన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈశ్వర్ ఆర్ట్స్ అండ్ డిజిటల్స్ ఆరోహి కళాక్షేత్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఓటు ఆవశ్యకతపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్ టీచర్ సోడవరం ఈశ్వరరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. శాంతినికేతన్ జూనియర్ కళాశాల డైరెక్టర్ సురంగి మోహనరావు, విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు, ఉప గ్రంథాలయ అధికారి వి.శంకరరావు తదితరులు విచ్చేసి విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ఈశ్వరరావు మాట్లాడుతూ ఓటు హక్కుపై చైతన్యం తేవడానికి బుధ, గురు, శుక్రవారాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ముగ్గుల పోటీల్లో తొలి మూడు స్థానాల్లో డి.ఇందు, ఎస్.విద్యశ్రీ, ఎస్.సుమిత్ర, వ్యాసరచన పోటీల్లో హారిక చంద్ర, విద్య ఝాన్సీ, చిత్రలేఖనం పోటీల్లో హేమంత్, ప్రేమ్‌కుమార్, అభి గెలుపొందారు.

మళ్లీ వచ్చేది జగన్ ప్రభుత్వమే

● ఎన్నికల ప్రచారంలో నరసన్నపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కృష్ణదాస్



సారవకోట: ఇంటింటా ప్రచారం చేస్తున్న ధర్మాన కృష్ణదాస్

సారవకోట: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వమేనని నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడచిన ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అర్హతే ప్రమాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. సంక్షేమ పథకాలన్నీ మరోసారి కొనసాగాలంటే ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి చేయాలన్నారు. పేదలకు అందించే సంక్షేమ పథకాలను అందనివ్వకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నార ని దీనిని ప్రజలు గమనించాలన్నారు.

ప్రచార పర్వం

ఆయనతో పాటు పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, చిన్నాల లక్ష్మీనారాయణ నాయుడు, వరుదు దేవీప్రసాద్, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ నక్క తులసీదాస్, రైస్ మిల్లర్ల సంఘం ట్రెజరర్ పాగోటి రాములు, జలుమూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొంగు కొండయ్య తదితరులున్నారు.



కోటబొమ్మాళి: ఎత్తురాళ్లపాడులో ప్రచారం చేస్తున్న దృశ్యం

గ్రామాల్లో జోరుగా ప్రచారం

కోటబొమ్మాళి: మండలంలోని ఎత్తురాళ్లపాడు, పంతులపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, ఎంపీగా పేరాడ తిలక్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎత్తురాళ్లపాడు సర్పంచ్ తలగాన గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మేజర్ పంచాయతీలో ప్రచారం



నరసన్నపేట: పురుషోత్తంనగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ శంకర్ తదితరులు

నరసన్నపేట: మేజర్ పంచాయతీ నరసన్నపేటలో సర్పంచ్ బూరెల్లి శంకర్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. పురుషోత్తంనగర్, రాజీవ్‌నగర్ కాలనీల్లో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ఇంటింటికీ పంపిణీ చేసి సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేగా ధర్మాన కృష్ణదాస్, ఎంపీగా పేరాడ తిలక్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు డేవిడ్, పార్టీ నాయకుడు పతివాడ గిరీశ్వరరావు ఉన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి



నందిగాం: పోతులూరులో ప్రచారం చేస్తున్న భార్గవి, శ్రీరామమూర్తి

నందిగాం: ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ భార్య, నందిగాం జెడ్పీటీసీ సభ్యురాలు పేరాడ భార్గవి, ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి కోరారు. కర్లపూడి, పోతులూరు, చిన్న తామరాపల్లి, మాలపేట, నౌగాం, హర్షబడ, ఎస్ఆర్‌కే పురం, తమలాపురం, కైజోల, మదనాపురంలో ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి అందరికీ మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకునేందుకు సహకరించాలని కోరారు. వైస్ ఎంపీపీ రేగల లక్ష్మీకాంతం, నాయకులు తమిరె బలరాం, తమిరె రాజు, అంబోడి విష్ణు, పేరాడ రమేష్, కవిటి వెంకట్ ఉన్నారు.



సంతబొమ్మాళి: ఉమిలాడలో ప్రచారం చేస్తున్న నాయకులు

దువ్వాడ, తిలక్‌ను గెలిపించండి

సంతబొమ్మాళి: ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎంపీగా పేరాడ తిలక్, ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్‌ను గెలిపించాలని పీఏసీఎస్ అధ్యక్షుడు కిల్లి జగన్నాయకులు కోరారు. ఉమిలాడ, పాలతలగాం, మేఘవరం, నౌపడ, బోరుభద్ర పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.అప్పారావు, బి.లక్ష్మీకాంతం, పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.జోగారావు, నరేష్, అప్పలనాయుడు, కె.దామోదర్‌రావు పాల్గొన్నారు.

స్వగ్రామంలో కృష్ణదాస్ ప్రచారం

పోలాకి: నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ తన స్వగ్రామమైన పోలాకి మండలంలోని ముబగాంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంతటి గౌరవం ఇచ్చిన గ్రామస్తులకు ఎప్పుడూ రుణపడి ఉంటామని అన్నారు. మరోసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు.



ముబగాంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్



హాజరైన ప్రజలు

గ్రామస్థాయిలో బలమే విజయానికి దోహదం

● స్థానిక సంస్థల్లో బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీ
● చతికిలపడిన టీడీపీ



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

టెక్కలి: ఏ రాజకీయ పార్టీకైనా గ్రామస్థాయిలో ఉన్న స్థానిక సంస్థల బలమే ఎమ్మెల్యే స్థాయి అభ్యర్థుల విజయాలకు అనుకూలంగా ఉంటాయి. టెక్కలి నియోజకవర్గంలో గ్రామ స్థాయిలో స్థానిక సంస్థల్లో అత్యధికంగా వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. దీంతో ఈ నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానికి అనుకూలంగా మారనున్నాయి. గడచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో టీడీపీ పూర్తిగా చతికిలపడింది. ఇదే ఎన్నికల్లో నాలుగు మండలాల్లో అటు సర్పంచ్‌లు, ఇటు ఎంపీటీసీ సభ్యులు అత్యధికంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించిన సంగతి తెలిసిందే. టెక్కలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే విజయం సాధించారు. అంతే కాకుండా సర్పంచ్‌లు, ఎంపీటీసీల విషయానికి వస్తే.. టెక్కలి మండలంలో మొత్తం 27 పంచాయతీల్లో 25 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులే సర్పంచ్‌లుగా విజయం సాధించారు. అలాగే 21 ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే గెలిపొందారు. నందిగాం మండలంలో 37 పంచాయతీల్లో 34 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. 18 ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే ఉన్నారు. కోటబొమ్మాళి మండలంలో 38 పంచాయతీల్లో 35 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. మొత్తం 21 ఎంపీటీసీ స్థానాల్లో 19 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులే విజయం సాధించారు. సంతబొమ్మాళి మండలంలో 34 పంచాయతీల్లో 29 మంది వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులే సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. మొత్తం 20 ఎంపీటీసీ స్థానాల్లో 18 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే గెలిపొందారు. టెక్కలి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయఢంకా మోగించి గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీకి మరింత బలం చేకూర్చారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యేకంగా ఈ ప్రభావం చూపనుంది. గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీకి అత్యధికంగా బలం ఉండడంతో పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ అందజేసిన సంక్షేమ పథకాలు, ఆయా గ్రామాల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీకి మరింత బలాన్ని చేకూర్చాయి. దీంతో ఈ ఎన్నికల్లో టీడీపీ గెలుపు విషయంలో ఆయా అభ్యర్థులకు ముచ్చెమటలు పడుతున్నాయి.

మరో వైపు టీడీపీకి రిగ్గింగ్‌లకు అవకాశం ఉన్న పోలింగ్ బూత్‌లపై ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఈసీకి ఫిర్యాదు చేయడంతో, ఆయా బూత్‌లపై మరింత నిఘా వేయనున్నారు. స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకి ఉన్న బలం ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి దోహదపడనుంది.

మంచిచేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి

● వైఎస్సార్‌సీపీకి మాజీ సైనికుల మద్దతు



మాట్లాడుతున్న కృష్ణచైతన్య

నరసన్నపేట: రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ మంచి చేసిన ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య కోరారు. స్థానిక పైడితల్లి ఆలయ సమీపంలో శుక్రవారం పారామిలటరీ, ఆర్మీ మాజీ సైనికులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ కుటుంబానికి గడిచిన 59 నెలల్లో మంచి జరిగిందని అన్నారు. ఈ విషయాన్ని గర్వంగా చెప్పగలుగుతున్నామని అన్నారు. రూ. వేల కోట్లు డీబీటీ పద్ధతిలో పేద ప్రజల ఖాతాల్లో వేయడాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు మేలు జరుగుతోందన్నారు. ప్రతీ ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా పారామిలటరీ సంక్షేమ సంఘం నియోజకవర్గం ప్రతినిధులు యాళ్ల అప్పలనాయుడు, గంగిట్ల శ్రీను మాట్లాడుతూ.. పారామిలటరీ సంఘ భవన నిర్మాణానికి నరసన్నపేటలో విలువైన స్థలం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఇచ్చారని అన్నారు. దేశంలో ఎక్కగా లేని విధంగా ఈ సంఘానికి నరసన్నపేటలో ఒక భవనం ఉందని అన్నారు. ఈ ఎన్నికల్లో తమ మద్దతు సంపూర్ణంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే ఉంటుందన్నారు. నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్ విజయానికి అందరమూ బాధ్యతగా పనిచేస్తున్నామని చెప్పారు. కృష్ణదాస్ గెలుపు ఖాయమ ని అన్నారు. అలాగే ఆర్మీ సంక్షేమ సంఘం ప్రతినిధి సాంబశివరాజు మాట్లాడుతూ.. తమ సంఘం తర పున మద్దతు తెలిపారు. అలాగే నాయీ బ్రాహ్మణు లు, కళాకారులు, జగన్నాథపురం యువజన సంఘం ప్రతినిధులు కూడా తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

పేదలకు న్యాయం జగన్‌తోనే సాధ్యం

పోలాకి: పేద ప్రజలకు న్యాయం జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా గెలిపించాలని శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ అన్నారు. పిన్నింటిపేటలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. వివిధ ప్రజాప్రయోజన పథకాల ద్వారా అనేకమంది పేదల కుటుంబాల్లో వెలుగులు నిండాయని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో బడుగువర్గాల ఆర్థిక అభివృద్ధికి డీబీటీ స్కీంలు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. జిల్లాలో ఎంపీతో సహా అన్ని ఎమ్మెల్యే స్థానాల్లోనూ శిష్టకరణ కుటుంబాలను కలిసి వైఎస్సాసీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని మద్దతు కోరామన్నారు.

‘శిష్టకరణాలను ఆదుకున్నది వైఎస్ కుటుంబమే’



మాట్లాడుతున్న కృష్ణ, ఉమామహేశ్వరరావు

కోటబొమ్మాళి: శిష్టకరణ సామాజిక వర్గాన్ని ఆదుకున్నది వైఎస్ కుటుంబమేనని..అందుకే తామంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామని రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, సంఘం రాష్ట్ర నాయకుడు పోలిమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. కోటబొమ్మాళి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ శిష్టకరణాలను ఓసీ కేటగిరీ నుంచి బీసీస–డీలోకి తెచ్చి అన్నిరంగాల్లో రిజర్వేషన్ కల్పించారన్నారు. తమ సామాజిక వర్గానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, టెక్కలి అసెంబ్లీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌లతో పాటు అన్ని నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులకు ఓట్లువేసి గెలిపించుకోవడానికి శిష్టకరణ సామాజికవర్గం సిద్ధంగా ఉందన్నారు. స్థానిక వార్డు సభ్యుడు డబ్బీరు ప్రదీప్‌కుమార్, అంపలాం వసంతకుమార్, శశిభూషణరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చందనోత్సవం

సారవకోట: మండల కేంద్రంలోని శివ రామ పాత్రుని కోనేరు గట్టుపై ఉన్న నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో చందనోత్సవాన్ని నిర్వహించారు. దీంట్లో భాగంగా ఆలయంలో స్వామి వారి మూల విరాట్‌ను చందనంతో అలంకరించి ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి మూలవిరాట్‌ను చందనంతో అలంకరించిన దృశ్యం

ఆదిత్యుని సన్నిధిలో ఎన్నికల పరిశీలకులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని విజయనగరం జిల్లా జనరల్ ఎన్నికల పరిశీలకులు హనీష్ ఛబ్రా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో గోత్రనామాలతో పూజలు చేసి ఆలయ విశిష్టతను వివరించారు. ఈయన వెంట శ్రీకాకుళం తహశీల్దార్ ఉన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయుడు, ఆశావర్కర్!



టీడీపీ ప్రచారంలో ఉపాధ్యాయుడు కవీశ్వరరావు (వృత్తంలో ఉన్న వ్యక్తి)



ప్రచారంలో ఆశా కార్యకర్త సరోజని (సర్కిల్లో ఉన్న మహిళ)

టెక్కలి: టెక్కలి మండలం బూరగాం గ్రామంలో ఇటీవల టీడీపీ నాయకుడు అచ్చెన్నాయుడు చేసిన ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయుడు, ఆశవర్కర్ పాల్గొని ఎన్నికల కోడ్‌ను తుంగలో తొక్కేశారు. దీంతో స్థానిక నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు శంభాన కవీశ్వరరావు, ఆశాకార్యకర్త పోలాకి సరోజని తదితరులు అచ్చెన్నాయుడుతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. దీనిపై ఇప్పటికే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ నాయకుడు



రాంబాబుకు వైఎస్సార్‌సీపీ కండువా వేస్తున్న కృష్ణచైతన్య

పోలాకి: ప్రజల సంక్షేమాన్ని అడ్డుకుంటున్న కూటమి పార్టీలకు ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదని బీజేపీ పోలాకి మండల మాజీ అధ్యక్షుడు బుడ్డా రాంబాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య సమక్షంలో ఆయన పార్టీలో శుక్రవారం చేరారు. రాష్ట్రంలో బీజేపీ.. టీడీపీతో పొత్తు కుదిరినప్పటి నుంచి ఆ పార్టీకి రాంబాబు దూరంగా ఉన్నారు. బలమైన బీసీ నేతగా, శ్రీశయన సంఘానికి జిల్లా నాయకుడిగా ఈయనకు గుర్తింపు ఉంది. నరసన్నపేట అభివృద్ధికి పాటుపడిన ధర్మాన కృష్ణదాస్ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానని రాంబాబు చెప్పారు. ఈయకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని కృష్ణచైతన్య హామీఇచ్చారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, మండల యువజన విభాగం నాయకులు చింతు రాఘవరావు, బెలమరపాలవలస పంచాయతీకి చెందిన నాయకులు గొర్లె తిరుపతిరావు, గేదెల నాగేశ్వరరావు, గొండు బాలకృష్ణ, ముదిలి సూర్యనారాయణ ఉన్నారు.



కాళిదాస్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ రాజేశ్వరరావు

–పోలాకి: మండల టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు కొచ్చెర్ల కాళిదాస్ శుక్రవారం వైస్సార్‌సీపీలో చేరారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం దేశంలో దళితులు, మైనార్టీలపై అనుచరిస్తున్న విధానాలను వ్యతిరేకించి కూటమి పార్టీల నుంచి బయటకు వచ్చినట్లు ప్రకటించారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు దండులక్ష్మీపురం గ్రామంలో మరో 20 దళిత కుటుంబాలు పార్టీలో చేరాయి. పార్టీలోకి వచ్చిన వారిని మండలపరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు కె.లక్ష్మణరావు అభినందించారు. ఎమ్మెల్యేగా ధర్మాన కృష్ణదాస్, ఎంపీగా పేరాడ తిలక్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గురువు బాలక్రిష్ణ, చింతాడ భీమారావు, సువ్వారి నాగేశ్వరరావు ఉన్నారు.

క్లుప్తంగా

గుడ్ మార్నింగ్ ఈదుపురం



మహిళలతో కలిసి టీ తాగుతున్న విజయ

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురంలో గురువారం పల్లెనిద్ర చేసిన వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ గుడ్ మార్నింగ్ ఈదుపురం అంటూ శుక్రవారం ఉదయం గ్రామ ప్రజలను పలకరించారు. ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మలతో కలిసి కాఫీ తాగుతూ స్థానిక మహిళల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్, సర్పంచ్ నర్తు వరప్రసాద్‌యాదవ్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు నర్తు శాంతి, పిట్ట హేమలత తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి సీఎం చేద్దాం



తలతంపరలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్

కంచిలి: రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సుపరిపాలన అందించిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని తలతంపర పంచాయతీ పరిధిలో ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జగబంధు దొళాయి, ఎంపీటీసీ సభ్యుడు బృందావన్ సాహు, కవిటి పీఏసీఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహు, పురుషోత్తం దొళాయి, భరత్ దొళాయి, కాకర్ల ఆదినారాయణ, కాకర్ల కామేష్, బైరాగి దొళాయి, ఖిత్రో దొళాయి, బెందాళం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియుల ఓట్లు అడిగే అర్హత టీడీపీకి లేదు



మాట్లాడుతున్న కృష్ణారావు

వజ్రపుకొత్తూరు: రాష్ట్రంలో అగ్నికుల క్షత్రియుల ఓట్లను అడిగే అర్హత తెలుగుదేశం పార్టీకి లేదని జిల్లా అగ్నికుల క్షత్రియుల యూత్ ఫోర్స్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దున్న కృష్ణారావు అన్నారు. మండలంలోని పూండిలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి మత్స్యకారులు, అగ్నికుల క్షత్రియులపై చిన్నచూపు చూసిందన్నారు. తమకు ప్రాధాన్యమివ్వకుండా అటు గౌతు కుటుంబం, ఇటు కింజరాపు కుటుంబాలు మోసం చేసి అణిచివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో మత్స్యకారులకు ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పిన చంద్రబాబు వెన్నుపోటు పొడిచారన్నారు. అలాగే అగ్నికుల క్షత్రియుల నుంచి ఓ విశ్రాంత ఉద్యోగి టీడీపీలో చేరుతామంటే గౌతు, కింజరాపు కుటుంబాలు అడ్డుకుని అన్యాయం చేశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీలో మత్స్య కారులు, అగ్నికుల క్షత్రియులకు మంచి గుర్తింపు లభించిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో పలాస నియోజకవర్గం నుంచి అగ్నికుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన జుత్తు జగన్నాయకులను ఎమ్మెల్యేగా చేస్తే, ఆయన తనయుడు ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుడైన డాక్టర్ సీదిరి అప్పలరాజుకు ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చి మంత్రిని చేశారని గుర్తు చేశారు. అణిచివేత, అన్యాయనికి గురైన ఓటర్లు ఇది గమనించి జిల్లాలో టీడీపీకి తమఓటు ద్వారా బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.



రుచికరమైన జీడిపప్పుకు ప్రపంచ ప్రఖ్యాత గాంచిన ఉద్దాన ప్రాంతంలోని పలాసను ప్రత్యేకంగా పరిచయం చేయనక్కరలేదు. అటువంటి పలాస నియోజకవర్గం ప్రతిష్టను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెంచింది. మరోసారి అవకాశం ఇస్తే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామని, నూతన పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామని చెబుతున్న వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో 'సాక్షి' ముఖాముఖి...

సాక్షి ఇంటర్వ్యూ

– కాశీబుగ్గ

పలాస ప్రతిష్టను పెంచాం

- ✔ ఆఫ్‌సోర్ ప్రాజెక్టు, మదనగోపాలసాగర్‌పై దృష్టి
- ✔ నువ్వలరేవు జెట్టీని హార్బర్‌గా మార్చడమే లక్ష్యం
- ✔ అభివృద్ధి చేసి చూపించాము, గెలిచి మరింత చేస్తాం
- ✔ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

సాక్షి: తొలిసారి ఎమ్మెల్యేగా, మంత్రిగా పలాసకు ఏం చేశారు..?

మంత్రి సీదిరి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో రాజకీయ అరంగ్రేటం చేసిన నేను పలాస అభివృద్ధిలో సంతృప్తిగా ఉన్నాను. పలాస నియోజకవర్గం అనేది గౌతువారి పాలనలో 60 ఏళ్లు మగ్గిపోయింది. వారికి పదవి మాత్రమే కావాలి, అభివృద్ధిని ఎన్నడూ పట్టించుకోరు. గెలిచిన వెంటనే సోంపేటనో, విశాఖనో వెళ్లిపోయి, మరలా ఎన్నికల సమయంలోనే పలాసకు వస్తారు. నియోజకవర్గంలో రూ.800 కోట్లతో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు, రూ.85 కోట్లతో కిడ్నీ పరిశోధన కేంద్రం, నియోజకవర్గం మొత్తం ముఖ్యమైన రోడ్ల విస్తరణ, యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు కొత్తగా ఏర్పాటు చేసుకున్నాము. పలాసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొత్త జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసుకున్నాం. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీని 14వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకున్నాము.

సాక్షి: మరోసారి గెలిస్తే కిడ్నీ రోగులకు ఎటువంటి మేలు చేస్తారు..?

మంత్రి సీదిరి: పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసుకున్నాం. ఇప్పుడు పూర్తిస్థాయిలో సూపర్ స్పెషాలిటీ సేవలు మెరుగుపరిచి అన్ని రకాల వైద్య సేవలు, అత్యవసర సేవలు అందిస్తాము. కిడ్నీ వ్యాధికి గల కారణాలు ఏమిటి అనే పరిశోధన కొలిక్కి తెచ్చి ప్రజలను అప్రమత్తం చేస్తాము. మనకు అందుబాటులో లేని అరుదైన కిడ్నీ మార్పిడి యూనిట్‌ను సైతం రానున్న రోజుల్లో తీసుకొని వస్తాము. పలాసలో యూనిట్ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే పచ్చజెండా ఊపారు.

సాక్షి: జీడి రైతుల సమస్యలకు పరిష్కారం..?

మంత్రి సీదిరి: అరవై ఏళ్లుగా పాలించిన నాయకులు ఉద్దాన ప్రాంతానికి ఏమీ చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఉద్దానంలో పండుతున్నటువంటి జీడిపంటపై హార్టీకల్చర్ ఉన్నత అధికారులతో కమిటీ వేశాము. ఉద్దానంలో మూడు రోజులుపాటు పర్యటించిన హార్టీకల్చర్ కమిషనర్, ప్రధాన కార్యదర్శులు ఒక విధానాన్ని తయారు చేశారు. వచ్చే పంటకాలం నుంచి రైతుభరోసా కేంద్రాల ఆధ్వర్యంలో జీడిపంటను కొనుగోలు చేయనున్నారు. రైతులకు మంచి ధరను సైతం అందించనున్నారు.

సాక్షి: సాగునీటి ఇబ్బందులు ఎలా అధిగమిస్తారు..?

మంత్రి సీదిరి: గడిచిన ఐదేళ్లలో రెండేళ్లు కరోనాతో పోయాయి. మిగిలిన మూడేళ్లలో సుమారు రూ.2,000 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. అయితే ఇంకా సాగునీరు–తాగునీరుపై దృష్టి సారిస్తాము. పలాస మండలంలో 50 శాతం పనులు పూర్తి చేసుకుని నిర్మాణం జరుగుతున్న మహేంద్రతనయ ఆఫ్‌సోర్ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి రైతులకు అందించడం, మందస మండలంలో మదనగోపాలసాగరం పూర్తిచేసి సాగునీరు అందించడం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో శివారు ప్రాంతాలకు వంశధార నీరు అందేలా చర్యలు చేపడతాము. లిఫ్ట్ ఇరిగేషన్లు ఏర్పాటు చేసి నీరు అందిస్తాము. చిన్న నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్నవాటిని సరిచేస్తాము. వజ్రపుకొత్తూరు మండలంలో నువ్వలరేవు జెట్టీనీ హార్బర్‌గా మార్చుకుని స్థానికంగా మత్స్యకారులకు చక్కని సౌలభ్యం కల్పిస్తాము.

సాక్షి: గెలుపుపై మీ నమ్మకం ఏంటి..?

సీదిరి: నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు ద్వారా నేరుగా రూ.1,530 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో చేరాయి. అదేవిధంగా సుమారు రూ.2 వేల కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు జరిగాయి. అర్ధరాత్రి తలుపుతట్టినా ఉన్నానని ప్రజల కోసం నిలబడి, 60 ఏళ్లలో చేయలేని అభివృద్ధి ఐదేళ్లలో చేసి చూపించాను. ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్న తీరుతో నేను గెలుస్తానే నమ్మకం ఉంది. ఇంతలా ప్రజల కోసం కష్టపడినవారు గెలవకుండా, ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేసేవారు గెలుస్తారా.

సాక్షి:యువతకు మీరేమి చేశారు..?



సీదిరి: పలాస నియోజకవర్గంలో ఉన్నటువంటి యువ తరానికి మండలానికి రెండు డిజిటల్ లైబ్రేరీలు ఏర్పాటు చేస్తున్నాము. అవి పూర్తి చేయడం లక్ష్యంగా ఉన్నాము. ఇప్పటికే రూ.32 లక్షలతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశాము. 60 ఎకరాల్లో నూతన పారిశ్రామిక వాడను ఏర్పాటు చేశాము. అది పూర్తిచేసి యువతను పారిశ్రామికవేత్తలుగా మార్చి, అక్కడ పరిశ్రమల్లో యువతకు ఉపాధి కల్పిస్తాము. మన సమీపంలో ఉన్న పోర్టులో ఉపాధితో పాటు ఎగుమతులు, దిగుమతులతో వలసను అరికడతాం. పలాసలో యువతకు ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి స్వయం ఉపాధి కల్పిస్తాము. యువతకు అవసరమైన ఇండోర్ స్టేడియం నిర్మించి పూర్తిచేసి, క్రీడలకు ప్రోత్సాహం అందిస్తాము. డిగ్రీ కళాశాల ఏర్పాటు, వృత్తి ఉపాధి కోర్సులతో కూడిన రెండు ఇంటర్ కళాశాలలను ఏర్పాటు చేశాము.

కులాసాగా పలాస



విస్తరించిన కేటీ రోడ్డు సాక్షిగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కులాసాగా కనిపిస్తోంది. కొత్తగా వచ్చిన కిడ్నీ ఆస్పత్రి పురపాలికకు మణిహారంగా మారింది. ఐదేళ్ల కాలంలో మున్సిపాలిటీ బడి స్పష్టమైన మార్పులకు సాక్ష్యంగా నిలబడింది. నీరు నుంచి దారుల వరకు, పార్కు నుంచి ప్లై ఓవర్ వరకు అసలైన ప్రగతి కళ్ల ముందు నిలిచింది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీని గ్రేడ్-03 నుంచి గ్రేడ్-02 కు అప్‌గ్రేడ్ చేశారు.

పనులు జరుగుతున్న కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద ప్లై ఓవర్ వంతెన

- వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి పథంలో మున్సిపాలిటీ
- పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన
- మంత్రి సీదిరి చొరవతో సమస్యలకు పరిష్కారం

కాశీబుగ్గ: పలాస, కాశీబుగ్గ జంట పట్టణాలను 2002లో మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. అయితే అనంతరం మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పవచ్చు. వైఎస్సార్‌సీపీ హయాంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో గత ఐదేళ్లలో పట్టణం కొంతపుంతలు తొక్కింది.

ప్రజారోగ్యానికి పెద్దపీట

ప్రజారోగ్యం నిమిత్తం ప్రభుత్వ వైద్య విధానాన్ని గాడిన పెట్టేందుకు సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ప్రజలచెంతకు ఆరోగ్య సేవలను చేర్చాలని సంకల్పించారు. ఈ క్రమంలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో రూ.2.24 కోట్లతో మూడు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల నిర్మాణం జరిగింది.

తాగునీటి ప్రాజెక్టులు

మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు ఎటువంటి తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు మంచినీటి ప్రాజెక్టుల నిర్మాణానికి జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు రూ.217 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వీటిలో పలాస–కాశీబుగ్గకి రూ.95.59 కోట్లు కేటాయించారు.

విద్య

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఫేజ్–1, ఫేజ్–2 ద్వారా రూ.11.13 కోట్లతో మున్సిపాలిటీ పరిధిలోని 15 పాఠశాలలను అభివృద్ధి చేశారు.

పార్కుల అభివృద్ధి

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని నెహ్రూ పార్కు అభివద్ధికి రూ.10 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే రూ.32 లక్షలతో రెండు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు.

రహదారులు

మున్సిపాలిటీలో రూ.4 కోట్లతో కేటీ రోడ్డు విస్తరణ చేశారు. అలాగే రూ.15.70 కోట్లతో సీసీరోడ్లు, బీటీరోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టారు. పలాస–కాశీబుగ్గ పరిధిలో రూ.18 కోట్లతో రైల్వే ప్లై ఓవర్ పునః నిర్మాణం జరుగుతోంది.

డంపింగ్ యార్డుల అభివృద్ధి

పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీలో రూ.40 లక్షలతో చెత్త సేకరణ కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

రూ.85 కోట్లతో కిడ్నీ పరిశోధన కేంద్రం

ఇప్పటివరకు జీడి పప్పు అంటే పలాస గుర్తుకువచ్చేది. ఇకపై కిడ్నీ ఆస్పత్రి అన్నా పలాసే గుర్తుకు వచ్చేలా ఇక్కడ కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించి ప్రారంభించింది. రూ.85 కోట్లతో కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం స్పెషలిస్టులతో పాటు మొత్తంగా 17 మంది వైద్యులు, స్టాఫ్ నర్సులు 60 మంది, డీడీఏ స్టాఫ్ 50 మంది, సపోర్టింగ్ స్టాఫ్ 20 మంది సేవలు అందిస్తున్నారు.

అతిపెద్ద జగనన్న కాలనీ

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో జాతీయ రహదారి పక్కన రామకృష్ణాపురం రెవెన్యూ పరిధి, కోసంగిపురం గ్రామం వద్ద 49 ఎకరాల్లో జగనన్న కాలనీ నిర్మించారు. ఇప్పటికే వందల సంఖ్యలో నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు సైతం పూర్తి చేశారు.

జీడికి జీవం

పలాసలో 400కుపైగా జీడి పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ రోజుకు రూ.5 కోట్ల నుంచి రూ.6కోట్ల వరకు వ్యాపారం జరుగుతుంది. అయితే ఇక్కడి వ్యాపారులకు రావాల్సిన ప్రోత్సాహకాల విషయంలో టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. వైఎస్సార్ సీపీ సర్కారు మాత్రం 2014 నుంచి 2020 వరకు రావాల్సిన జీడి ప్రోత్సాహకాలు రూ.120 కోట్లను విడుదల చేసింది. అంతేకాకుండా 60 ఎకరాల విస్తీర్ణంలో నూతన పారిశ్రామిక వాడకు సీఎం శంకుస్థాపన కూడా చేశారు.

సంక్షేమ సారథిని సీఎంగా చేసుకుందాం

- వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం అభ్యర్థి పిరియా విజయ



కవిటి: కళింగపట్నంలో మాట్లాడుతున్న పిరియా విజయ

కవిటి: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా సంక్షేమ సారథిగా ఉన్నటువంటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. మండలంలోని కళింగపట్నం, కొత్తపాలెం, మాణిక్యపురం తదితర గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు. నవరత్నాలు ప్లస్ మ్యానిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈనెల 13వ తేదీన జరగనున్న పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పూడి లక్ష్మణరావు, పి.నీలాచలం, పి.శేఖర్, బి.రమణమూర్తి, ధర్మారావు, నాగు, దుర్యోధన, దేవరాజ్‌సాహూ, లలితాసాహూ, సత్యవతి సాహూ, ఊర్మిళా బిసాయి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

సోంపేట: పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్న టీడీపీ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిరియా విజయ పిలుపునిచ్చారు. కవిటి మండలంలోని కొత్తపాలేంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. పేదల జీవితాలతో టీడీపీ ముఠా చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ఇది వరకే ఇంటి వద్దకే పింఛన్లు రాకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. గత ఐదేళ్లుగా తూచా తప్పకుండా చెప్పిన సమయానికే ఇంటి వద్దకి వచ్చి సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించాలి

సోంపేట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని పిరియా విజయ కోరారు. మండలంలోని పలాసపురం పంచాయతీ లక్కవరం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లుగా ప్రభుత్వం చేసిన మేలును తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తడక యశోద, సర్పంచ్ తడక జోగారావు, ఎంపీటీసీ పోలాకి రమణ, పార్టీ నాయకులు పిరియా అప్పలస్వామి, దున్న మోహన్, సనపల కిరణ్, వజ్జ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా జీడిపంట కొనుగోలు



నువ్వలరేవులో జన సంద్రం మధ్య మంత్రి సీదిరి ఎన్నికల ప్రచారం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంత ప్రజల జీవనాధారమైన జీడి పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి ఉద్యాన రైతులను ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గం అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హామీ ఇచ్చారు. మండలంలోని గుణుపల్లి, మోట్టూరు, ఒంకులూరు, అనకాపల్లి, శాంతినగర్, తోటూరు చీపురపల్లి, కొండపల్లి, నువ్వలరేవు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఉద్యాన పంటలతో పాటు అంతర పంటలను ప్రోత్సహించిందని పేర్కొన్నారు. గత 5 ఏళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ప్రతి ఇంటికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేశామని తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు హనుమంతు వెంకటరావు దొర, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, హనుమంతు చిట్టి దొర, సుజాత పండా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు తిర్రి కామేశ్వరి, తిర్రి గుణ, తిర్రి లక్ష్మీనారాయణ, రాజారావు, కోడ నిరంజన్, మాధవరావు, రత్నాల భీమారావు, దిలీప్, జోగి అప్పారావు, మోహన్, దాసరి పాపారావు, కె.వాసు, కొర్రాయి గిరిబాబు, తమ్మినాన శాంతారావు, మరడ భాస్కరరావు, బి.ధర్మారావు, గుంటి జేజేరావు, లైశెట్టి జోగారావు పాల్గొన్నారు.



ఒంకులూరులో అభిమానుల మధ్య జరుగుతున్న ప్రచారం

మండపల్లిలో పల్లె నిద్ర



స్థానికులతో కలసి అల్పాహారం తింటున్న పిరియా విజయ



మండపల్లిలో పల్లె నిద్ర చేస్తున్న పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని మండపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ శుక్రవారం రాత్రి పల్లె నిద్ర చేశారు. కార్యక్రమానికి ముందు ఆమె రచ్చబండపై స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్ పిట్ట శశిరేఖ, ఎంపీటీసీ సభ్యురాలు పిట్ట హేమలత, పిట్ట మామయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారాలు..!

ప్రచార పర్వం

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో విజయమే ధ్యేయంగా ఎన్నికల ప్రచారాలు సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులంతా ప్రతి ఇంటికీ వెళ్లి గత ఐదేళ్లలో జరిగిన మేలును తెలియజేస్తున్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు వివరిస్తూ, మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం రూరల్: మశాఖపురం గ్రామంలో...



కాశీబుగ్గ: సీదిరి శ్రీదేవిపై పూలవర్షం కురిపిస్తున్న అభిమానులు



కాశీబుగ్గ: పురుషోత్తపురం గ్రామంలో...



కాశీబుగ్గ: 24వ వార్డులో...



కాశీబుగ్గ: మున్సిపాలిటీ 16వ వార్డులో...



వజ్రపుకొత్తూరు: పెద్ద బొడ్డపాడులో ప్రచారం...



ఇచ్ఛాపురం: ముడియా వీధిలో ప్రచారం...



ఇచ్ఛాపురం రూరల్: బొడ్డబడ గ్రామంలో...



ఇచ్ఛాపురం రూరల్: పాయితారిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నర్తు నరేంద్రయాదవ్



సోంపేట: పాత్రకొండ పంచాయతీలో...